క్లుప్తంగా

జీవీఎంసీ పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న ప్రొఫెసర్ నిర్మల

ఎంవీపీకాలనీ: ఉషోదయ కూడలిలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలకు బుధవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు నిర్మల దంపతులు కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. స్కూల్ విద్యార్థుల అవసరాల కు అనుగుణంగా వినియోగించుకునేందుకు ఈ కంప్యూటర్ అందించినట్లు వారు తెలిపా రు. రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం దుర్గ, క్లబ్ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బయోడైవర్సిటీ పార్కులో విద్యార్థుల సందడి

బీచ్‌రోడ్డు: నగరంలోని ఓ ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు బుధవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతారణం గురించి వివరించారు. విద్యార్థులు పార్కులోని మొక్కల ప్రత్యేకతను తెలుసుకుని సందడి చేశారు.

సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం



చెక్కు రూపంలో విరాళం అందజేస్తున్న మధుసూదన్, సావిత్రి కుటుంబ సభ్యుడు

డాబాగార్డెన్స్: సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావుకు బుధవారం ఆ చెక్కును అందించారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

డాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ) పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పిల్లల వైద్య సదుపాయంపై దృష్టి సారించాలి

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గొండు సీతారాం కోరారు. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ.వాణిని బుధవారం ఆయన సత్కరించారు. వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో పిల్లల వైద్యం కోసం ప్రత్యేక బెడ్లు, వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కోరినట్లు బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై వేసిన మట్టి కుప్పలు



ప్రధాన కాలువలో తొలగించిన పైపులు



కాలువలో ప్రవహిస్తున్న మురుగు నీరు

ఎక్కడి పనులు అక్కడే..!

- నత్తనడకన ఇసుకతోట ప్రధాన కాలువ పునర్నిర్మాణం
- పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై వేసి వదిలేసిన మట్టికుప్పలు
- కురుస్తున్న వర్షాలతో ముంపు భయం
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు, పాదచారులు
- తాత్సారం చేస్తున్న జీవీఎంసీ అధికారులు



హైవేపై ఇసుకతోట పెట్రోల్ బంక్ వద్ద తవ్వి వదిలేసిన ప్రధాన కాలువ

మద్దిలపాలెం: జాతీయ రహదారిపై ఇసుకతోట జంక్షన్ దరి చేపడుతున్న ప్రధాన కాలువ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతూ.. ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. జీవీఎంసీ 22వ వార్డు నుంచి 17వ వార్డులో ఎంవీపీ కాలనీ మీదుగా ఈ కాలువ ప్రవహిస్తోంది. ఇసుకతోట హైవేను ఆనుకుని ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న ఈ కాలువ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంచెత్తింది. మురుగు నీటి ప్రవాహం ఇసుకతోట ప్రధాన రహదారిపై పొంగిపొర్లింది. పెంట్రోల్ బంక్‌కు వెళ్లే మార్గంలో కింద వేసిన చిన్న పైపుల కారణంగా ప్రవాహానికి ఆటంకం ఏర్పడి మురుగు నీరు రోడ్ల పైకి వచ్చిందని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు గుర్తించారు. హుటాహుటిన పెంట్రోల్ బంక్‌కు వెళ్లే మార్గంలో కింద ఉన్న పైపులను తొలగించారు. నిలిచిపోయిన మురుగునీటి ప్రవాహానికి వీలు కల్పించారు. ఈ మరమ్మతులకు తవ్విన కాలువ పునర్నిర్మాణం చేపట్టకుండా ఎక్కడి పనులు అక్కడే నిలిపివేశారు. దీనికోసం తవ్విన మట్టికుప్పలను ప్రధాన రహదారిపై వేసి వదిలేశారు. దీంతో ఆ రోడ్డు మీదుగా ప్రయాణించే వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

దుర్వాసన బాబోయ్..

మురుగు నీటి ప్రవాహం వల్ల తలెత్తే ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశంతో ఈ కాలువను తవ్వి సకాలంలో తిరిగి నిర్మించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతమంతా అస్తవ్యస్తంగా తయారైంది. హైవే పక్కనే పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. దీనికి సంబంధించిన మ్యాన్‌హోల్‌పై మూత వేయకుండా వదిలేశారు. ఆ దారిలో రాకపోకలు సాగించే వారు వ్యర్థాల దుర్వాసనతో సతమతమవుతున్నారు.

ముంచుకొస్తున్న వర్షాలు

ఇప్పటికే వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. ఈ కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఈ సమయంలో ప్రమాదాలు సంబంవించే అవకాశాలున్నాయి. దీని ఎదురుగా పెట్రోల్ బంక్ ఉండటంతో నిత్యం వందలాది వాహనాలు వస్తూ పోతుంటాయి. ఇలాంటి చోట సత్వరమే కాలువ నిర్మాణం చేయాల్సి ఉన్నా.. జీవీఎంసీ అధికారులు తాత్సారం చేస్తున్నారు. వర్షాలు భారీగా కురిస్తే ఈ కాలువ పొంగి పొర్లుతుందని, ముంపు భాయమని స్థానికులు పేర్కొంటున్నారు.

మట్టికుప్పలతో ఇక్కట్లు

ప్రధాన కాలువ నుంచి తవ్విన మట్టిని రోడ్డు పక్కనే పెద్ద ఎత్తున కుప్పలుగా వేశారు. వీటితో వాహనాల రద్దీ సమయంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక్కడ వదిలేసిన మట్టికుప్పల వల్ల ఇబ్బంది పడుతున్నామని, తక్షణం తొలగించాలని వాహన చోదకులు కోరుతున్నారు. వెంటనే కాలువ నిర్మాణ పనులు చేపట్టి.. ముంపు బారిన పడకుండా చూడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

ఈ కాలువ నిర్మాణానికి కొద్ది రోజుల కిందటే శంకుస్థాపన చేశారు. దీన్ని నిర్మాణానికి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు రూ.40 లక్షలు అంచనా వేశారు. ఈ నిధులు స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టే అవకాశాలున్నాయని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ బుధవారం నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు తదితరులు స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. పల్లా శ్రీనివాస్ తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయన చిత్రపటం వద్ద జవహర్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం గతంలో మరణించిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున రావాల్సిన ప్రయోజనాలు అందాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి సీతారాం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: ఈపీడీసీఎల్ జోన్-3 పరిధిలోని ఆరిలోవ ఫీడర్ 33/11 కేవీ, విమ్స్ ఫీడర్ 11 కేవీ, పైనాపిల్ కాలనీ ఫీడర్ 33/11 కేవీ ప్రాంతాల్లో నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 13న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ(ఆపరేషన్) పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ స్తంభాలు మార్చడం తదితర పనులు చేపట్టనున్నామన్నారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్, సంతపాలెం, తోటగరువు, గాంధీనగర్, బాలాజీనగర్, అన్నానగర్, రవీంద్రనగర్, ముస్తఫా కాలనీ, కైలాసనగర్, పైనాపిల్ కాలనీ, శ్రీకృష్ణాపురం, సీఐడీ కార్యాలయం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో విదేశీ విద్య

ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌తో కుదిరిన ఒప్పందం



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న ఇరుసంస్థల ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఐఐఏఎం(ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్) బిజినెస్ స్కూల్ విదేశీ విద్యను అందించేందుకు ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఐజీఎంఏ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఎంవీపీకాలనీలోని ఐఐఏఎం బీ-స్కూల్‌లో బుధవారం ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఐఐఏఎం కార్యదర్శి, డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో యువతకు నాణ్యమైన విద్యను అందించి.. అంతర్జాతీయ ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. ఐఐఏఎం బీ-స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఏఐ టెక్నాలజీలకు సంబంధించిన కోర్సులు ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఏడాది పాటు దుబాయ్‌లో విద్యనభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ కోర్సులకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆమోదం ఉందన్నారు. ఐజీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు ఈ ఎంఓయూ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. విశాఖతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిజిటల్ యుగంలో సరీస్ మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ విద్య విశిష్టత, కార్పొరేట్ అవసరాలు, ఏఐ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన్ని ఐఐఏఎం బీస్కూల్ ప్రతినిధులు సత్కరించారు.

ఆకుపచ్చని ఆలోచన



బైక్‌పై మొక్కలు విక్రయిస్తున్న సతీష్

ఏయూక్యాంపస్: రాజమహేంద్రవరం వద్ద కడియం ప్రాంతానికి చెందిన సతీష్ తన ద్విచక్ర వాహనంపై మొక్కలను పెట్టుకుని నిత్యం నగరంలో విక్రయిస్తున్నాడు. అందరికీ ఆకుపచ్చని మొక్కలను పరిచయం చేస్తున్నాడు. మొక్క నాటడానికి అవసరమైన కుండీ, సహజ ఎరువులన్నీ టూ వీలర్‌పైనే పెట్టుకుని వీధుల్లో తిరుగుతూ అమ్ముతుంటాడు. బుధవారం కిర్లంపూడి లే అవుట్‌లో మొక్కలు విక్రయిస్తూ కనిపించాడు. తన వాహనానికి చిన్న మైక్ కూడా ఏర్పాటు చేసుకున్నాడు. తన వద్ద ఉన్న మొక్కల వివరాలను దానిలో వల్లిస్తున్నాడు. గులాబి, మందారం, సన్నజాజి వంటి పూల మొక్కల నుంచి అలంకరణ మొక్కలు, మామిడి వంటి పండ్ల మొక్కల వరకు అన్నీ తన ద్విచక్ర వాహనంపైనే పెట్టుకుని చల్లగా సాగిపోతున్నాడు. తన బైక్‌నే వ్యాపార వాహనంగా మార్చుకుని మూడేళ్లుగా విశాఖలో పచ్చని మొక్కలను విక్రయిస్తున్నాడు. ఒక చిన్న ఆలోచన అతడికి ఉపాధి కల్పిస్తూ.. ప్రతి ఇంట్లో ప్రాణవాయువును నింపే పచ్చని మొక్కలను పెంచే దిశగా నగరవాసులను నడిపిస్తోంది.

ఘనంగా దేవతల స్నానం



దేవతలను దర్శించుకుంటున్న ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్, భక్తులు

బీచ్‌రోడ్డు: దేవ స్నాన పూర్ణిమ సందర్భంగా ఉత్కల్ సంస్కృత సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం దసపల్లా హిల్స్‌లోని జగన్నాథ స్వామి దేవాలయంలో దేవతల స్నానం ఘనంగా నిర్వహించారు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవీలకు ఆలయ గర్భగుడి నుంచి పహండి అనే ఆచారంలో మంత్ర జపాల మధ్య 108 కుండల సువాసనగల నీటితో స్నానం చేశారు. అనంతరం దేవతామూర్తులకు గజానుడి వస్త్రాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు జె.కె నాయక్ మాట్లాడుతూ ఈ స్నానం వల్ల దేవతలకు జ్వరం వస్తుందని, అనసార అనే క్వారంటైన్‌లో 14 రోజులు ఉండి కోలుకుంటారని తెలిపారు. ఈ కాలం తరువాత ఈ నెల 26న ప్రసిద్ధ రథయాత్రకు బయలు దేరుతారని చెప్పారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ బిమల్ కుమార్ మహంత్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న గోశాలలో ఏరువాక పున్నమి



శ్రీకృష్ణాపురం గోశాలలో దుక్కి దున్నుతున్న సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: ఏరువాక పున్నమి(జ్యేష్ఠ పౌర్ణమి)ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం భూమి పూజ నిర్వహించారు. నాగలికి, ఎద్దులకు పసుపు కుంకుమలు సమర్పించి, అనంతరం వాటి సాయంతో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు నేలను దున్నారు. గోశాలలో పలు పంటలు పండించేందుకు, పూలమొక్కలు పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతి రైతుకు ఏరువాక పున్నమి ఎంతో విశేషమైన రోజుగా భావిస్తారన్నారు. వ్యవసాయ పనులు ఏరువాక పున్నమి రోజునే ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ప్రాచీన వేదకాలం నుంచి జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా పిలవడం పరిపాటిగా మారిందన్నారు. గోశాల సీనియర్ అసిస్టెంట్ మూల వాసు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఎంవీపీ ఎస్ఐ ఖాదర్ బాషాకు వచ్చి న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆయన బుధవారం 11 గంటల సమయంలో అప్పుఘర్ శ్మశానవాటిక వద్దకు వెళ్లగా.. అక్కడ ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. యువకులు పరారవ్వడానికి పరిగెట్టారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వేణు అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకొచ్చి కమీషన్ కోసం విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. నక్కవానిపాలేనికి చెందిన బొర్రా వేణుబాబు, యెరుషు మహేష్, కేఆర్ఎం కాలనీకి చెందిన బక్కా మనోజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

డెయిరీఫారం కూడలిలో బొమ్మకు విరిగిన చేయి



డెయిరీఫారం కూడలిలో చేయి విరిగిన పూల వ్యాపారి బొమ్మ

ఆరిలోవ: జాతీయ రహదారిపై 10వ వార్డు పాత డెయిరీఫారం కూడలిలో ఏర్పాటు చేసిన పూల వ్యాపారి బొమ్మ చేయి విరిగింది. గత ప్రభుత్వంలో రెండేళ్ల కిందట జీవీఎంసీ నగరంలో కూడళ్లను ఆధునికీకరించింది. ఇందులో భాగంగా డెయిరీఫారం కూడలిలో ఆకర్షణీయమైన పలు బొమ్మలు ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడలికి ఇరుపక్కలా రైతులు, వ్యాపారులు, కళాకారుల బొమ్మలు, కూడలి పక్కన ఎడ్ల బండి అమర్చారు. అవి ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ ఓ వైపు పూల బుట్ట పట్టుకుని పూలు విక్రయించినట్లు అమర్చిన వ్యాపారి బొమ్మకు చెయ్యి విరిగిపోయింది. దీంతో ఆ బొమ్మ ఆకర్షణ కోల్పోయింది.

ఆసియా రోలర్ స్కేటింగ్ పోటీలకు 'సత్యసాయి' విద్యార్థి



విద్యార్థి శంకర్

ఎంవీపీకాలనీ: 20వ ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంవీపీ కాలనీ శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థి సబ్బవరపు శంకర్ ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తరగతి చదువుతున్న శంకర్.. కొరియా వేదికగా జూలై 20 నుంచి 30 తేదీల మధ్య జరగనున్న పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఇప్పటికే స్కేటింగ్‌లో అనేక జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా శంకర్‌కు సత్యసాయి విద్యాసంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఆక్రమణలో ఫుట్‌పాత్



నౌరోజీ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన దృశ్యం

డాబాగార్డెన్స్: సాధారణంగా ఫుట్‌పాత్‌లు పాదచారులు నడవడానికి ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్ నియంత్రణకు ఫుట్‌పాత్‌లు వాడుతుంటారు. అవే ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారులు కూటి కోసం చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటుంటారు. అటువంటి వారిపై అధికారులు ఝులుం చూపిస్తుంటారు. ఫుట్‌పాత్‌నే తన ఇంటిగా వాడుకుంటున్న ఆ ఇంటి యజమానిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ఆ ప్రాంత స్థానికుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడి తీరు చూస్తుంటే.. ఫుట్‌పాత్‌ను ఆ ఇంటి యజమాని కబ్జా చేశారా? లేదా ఆ ఇంటి యజమాని స్థలాన్నే జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్ కింద ఏర్పాటు చేశారో తెలియడం లేదంటూ ఆ వినతిలో పేర్కొన్నారు. ఈ కబ్జా ఎక్కడో కాదు.. జోన్-4 పరిధి 28వ వార్డు నౌరోజీ రోడ్డు సీఎంఆర్ గొడౌన్ ఎదురుగా జరిగిందని ఫిర్యాదీదారుడి అర్జీ ద్వారా తెలుస్తోంది.

'సూపర్ సిక్స్' ఎప్పుడు నెరవేరుస్తావ్ బాబూ..!

- కూటమి పాలనలో ప్రజా సంక్షేమం గాలికి..
- పథకాలు, హామీల అమల్లో కాలయాపన
- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్వల సురేష్



బీచ్‌రోడ్డు: ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి, అధికారం చేపట్టి నేటికి ఏడాది గడుస్తున్నా.. సూపర్ సిక్స్ పథకాల ఊసేలేదని, వాటిని అమలు చేసేదెప్పుడని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్వల సురేష్ ప్రశ్నించారు. ఎన్నికల హామీల నెరవేర్చకుండా అధికారాన్ని అనుభవిస్తూ.. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ.. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ పెద్ద పెద్ద హోర్డింగులు, మీటింగులు పెట్టి ప్రచారం చేసిన చంద్రబాబు.. వాటిని ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశించారు. 'తల్లికి వందనం' అంటూ స్కూల్‌కు వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15,000 ఇస్తామన్నారు, ఇచ్చారా చంద్రబాబు..?, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి రూ.1,500 ఇస్తానన్నారు కదా.. ఎప్పుడిస్తారని రాష్ట్రంలోని ఆడబిడ్డలందరూ ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేకపోతే ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3,000 భృతి ఇస్తామని ఇచ్చిన బూటకపు హామీ గుర్తుందా బాబూ..? అని గుర్తుచేశారు. దేశానికి వెన్నుముక లాంటి రైతులకు ప్రతి యేటా రూ.20,000 ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పి ఏడాది పూర్తయిందని, అవి ఎప్పుడిస్తారని అన్నదాతలంతా దిగులుగా ఎదురుచూస్తున్నారన్నారు. తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని, హామీలన్నీ నెరవేర్చాలని ముప్వల సురేష్ డిమాండ్ చేశారు.

మన పొట్ట.. కాదు చెత్తబుట్ట



150 ఏళ్ల మర్రిచెట్టు వద్ద ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న గ్రీన్ క్లైమేట్ టీం, పలు సంస్థల ప్రతినిధులు

- ఆరోగ్యకర ఆహారమే తీసుకుందాం
- ఏరువాక పౌర్ణమి వేడుకల్లో గ్రీన్ క్లైమేట్ టీం

తాటిచెట్లపాలెం: ఏరువాక పౌర్ణమి కేవలం ఒక పండగ మాత్రమే కాదు.. ఇది మనం తినే ఆహారం ద్వారా అందరినీ ఏకం చేసే ఉత్సవమని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ మార్గంలోని సుమారు 150 ఏళ్ల చరిత్ర కలిగిన మర్రిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రీన్ క్లైమేట్ టీం, వనమాలి సీటీజీ, మన కూరగాయల తోట వంటి పలు సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జె.వి.రత్నం మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పండించిన పంటల ద్వారా లభించే దేశీయ విత్తనాలను ఇచ్చిపుచ్చుకునే ప్రాచీన సంప్రదాయాన్ని తిరిగి కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలు పండించాలని, అటువంటి ఆహారాన్నే తీసుకోవాలని కోరారు. 'మన పొట్ట చెత్తబుట్ట కాదు' అని గుర్తుచేస్తూ.. ప్యాకెట్లలో లభించే ప్రాసెస్డ్ ఆహారాన్ని దూరంగా ఉంచాలని సూచించారు. వనమాలి సీటీజీ గ్రూపుల అడ్మిన్ మళ్ల సరిత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి దగ్గర ప్రకృతి ఆధారిత కూరగాయలను పండించుకుంటూ, వాటిని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్, పెందుర్తి హాస్టల్ వార్డెన్ సత్య, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ. కృష్ణకుమారి, అరవల అరుణ, జె.రాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యాయిని పంతుల లలిత పాల్గొన్నారు.